క్లుప్తంగా

వైభవంగా నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కు అందజేస్తున్న దాత బాలాజీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం శ్రీకాకుళం జిల్లా కళింగపట్టణానికి చెందిన పాట్నూరు బాలాజీ లక్షా 16 రూపాయిల చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరపున అధికారులు దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

పరవాడ: పరవాడలో ఆర్మీ ఉద్యోగిపై అకారణంగా దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. దిశ యాప్ డౌన్‌లోడ్ సందర్భంగా ఏర్పడిన వివాదాన్ని ఆసరా చేసుకొని పోలీసులు ఆర్మీ ఉద్యోగిపై దాడి చేయడం మంచిదికాదన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే ఈ విధంగా దూకుడుగా ప్రవర్తించడం దారుణమని పేర్కొన్నారు. ఈ సంఘటనపై జిల్లా పోలీసు అధికారులు సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాణిక్యం డిమాండ్ చేశారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



వ్యాపారులకు సూచనలు చేస్తున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: మండలంలో అనధికారికంగా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ పి.ఈశ్వరరావు హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా బాణ సంచా సామగ్రి విక్రయించడం నేరమన్నారు. బాణసంచా సామగ్రి విక్రయించాలనే వ్యక్తులు ముందుగా అనుమతి పొందాలని సూచించారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ అభినందన



జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని, నిందితులను పోలీసులకు అప్పగించిన కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు ఆస్పత్రి వైద్యులు అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ జ్ఞాపికను బహూకరించారు. ఈనెల 6న సెక్యూరిటీ గార్డులు అల్లు కుమారస్వామి, రంగాల వినోద్‌కుమార్ కేజీహెచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళల బ్యాగులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ మహిళల బాగుల్లో గంజాయి బయట పడింది. దీంతో ఆ ముగ్గురు మహిళలను సెక్యూరిటీ గార్డులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మనప్రభుత్వం–ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా బుధవారం గొర్లివానిపాలెం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టారు. సర్పంచ్ గొర్లి గోపిఅమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారని చెప్పారు. ఏ గడపకు వెళ్లినా సంక్షేమ పథకాలతో తాము సంతోషంగా ఉన్నామని ప్రజలు చెప్పడం సంతోషించదగ్గ విషయమన్నారు.

సంక్షేమ పథకాలతో రూ.25 కోట్ల లబ్ధి

గొర్లివానిపాలెం గ్రామ ప్రజలకు నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.25 కోట్ల లబ్ధి చేకూర్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సభలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వెన్నలపాలెం, పెదముషిడివాడ సర్పంచ్‌లు వి.అప్పారావు, పల్లా అప్పారావు నాగమణి, పార్టీ నాయకులు పైల ఎర్రినాయుడు, పైల అప్పలనాయుడు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

నేడు పరవాడలో గడపగడపకు...

మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో గురువారం నిర్వహించే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి



అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మీరెడ్డి

పరవాడ: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరకులు ఎవరికైనా బదిలీ చేస్తే విధిగా స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మీరెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా పరవాడ 1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్, స్టాకును తనిఖీ చేశారు. స్టాక్ సక్రమంగా ఉందా లేదా అన్న వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే మెనూలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట అనకాపల్లి జిల్లా విద్యా శాఖ అడిషినల్ డైరెక్టర్ రవిబాబు, మండల విద్యాశాఖ అధికారి జి. సాయిశైలజ, దివాకర్‌రావు, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మీరెడ్డి బుధవారం తానాం గురుకుల జూనియర్ కళాశాల, బాలికల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాలతోనే ఉక్కు పరిరక్షణ



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం విద్యా సంస్థల బంద్ పాటించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ చర్యలు ఆపి పరిశ్రమను పరిరక్షించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. లంకెలపాలెం, పరవాడ, దేశపాత్రునిపాలెం గ్రామాల్లోని జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు బంద్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో నాయకులు వి.వి.రమణ, ఐద్వా నాయకురాలు పి.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ, కిరణ్, జి.యమ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు

పెందుర్తి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం పెందుర్తిలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. పలువురు విద్యార్థులతో కలిసి ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. కాగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆరుగురు విద్యార్థులను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఐద్వా నాయకులు ఇందిర తదితరులు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలకు 93 మంది ఎంపిక



జాబ్‌మేళా నిర్వహిస్తున్న పలు కంపెనీల ప్రతినిధులు



పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 93 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ఫ్లోరా తెలిపారు. వెస్ట్ సైడ్ కంపెనీకి 30 మంది, ఏస్ట్రోటెక్ స్టీల్స్ కంపెనీకి 20 మంది, ఐసీఐసీఐ బ్యాంకుకు 16 మంది, బీఎస్ఏకి 15మంది, డైకిన్ కంపెనీకి11 మంది, ఫ్రీసైజ్ గ్లోబల్ కంపెనీకి ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. ఆదర్శ్‌లో ప్రతి నెలా నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువత వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల హెచ్ఆర్లు విద్యాసాగర్ వర్మ, అనూష, రాజేశ్వరి, సంతోషి, సత్యతేజ, ఆదర్శ్ కళాశాల ప్లేస్మెంట్ సెల్ అధికారి ఫాతిమున్నిసా బేగం, కరస్పాండెంట్ టి.థియోఫిలస్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ట్రైనింగ్ ఒడ్ ప్లేస్‌మెంట్ సిబ్బంది సింహాచలం, పద్మ, గౌతమ్,వినయ్, మురళీకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ మూర్తి కోరారు. ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విమ్స్ ఆవరణలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. మరో వైపు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు తెరవకూడదన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు వారిని కనిపెడుతుండాలని ఆయన సూచించారు. విశాఖ ఏజెన్సీతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి గంజాయి సరఫరా అవుతుందన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనచోదకులు, యూనియన్ నాయకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సదస్సులో ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇంజినీర్ కరీం, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి రవికుమార్, పాఠశాల విద్యార్థులు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సింహాచలం: విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్, విశాఖ ఐ బ్యాంక్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మోసిన్ స్కూల్ హెల్త్ ఐకేర్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన శిబిరంలో 1000 మంది విద్యార్థులకు ఐ రిఫ్రెక్షన్, కలర్ విజన్ పరీక్షలు చేశారు. కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.కంటికి సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. ఐ కేర్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఈ.సాయికృష్ణ కె.రామన్న, హెచ్.చంద్రశేఖర్, సయ్యద్ ఇమ్రాన్, కె.సరోజినీ, ఆర్.యశ్విని పరీక్షలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, కళాశాల వైద్యాధికారి డాక్టర్ ఎస్.భాను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తెలుగు భాషకు 'గిడుగు' సేవలు అపూర్వం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

తాటిచెట్లపాలెం: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగు భాషకు గొడుగు – గిడుగు అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వేణు ప్రసంగిస్తూ తెలుగు భాషకు.. ముఖ్యంగా వ్యవహారిక భాష ఉనికికి, వ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక భాషా శాస్త్రంలో అసదృశ విద్వాంసుడు, దీక్షా పరుడు, నిర్భయుడు, తెలుగు సవరల భాషల అదృష్టదీపకుడు, మహామనిషి గిడుగు రామమూర్తి పంతులు అని కితాబిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సవర భాష వ్యాప్తికి కృషి చేసి నిఘంటువులను తయారు చేశారన్నారు. ఆయన కృషికి అప్పటి ప్రభుత్వం రావ్ బహదూర్ బిరుదుతో సత్కరించిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి. సూర్యారావు, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, భాగవతుల సత్యనారాయణ మూర్తి, పి.గణేశ్వరరావు, గండికోట సుబ్బలక్ష్మి, పి.వి.ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డీసీపీ-2 ఆనందరెడ్డి



స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న డీసీపీ ఆనందరెడ్డి

ఉక్కునగరం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగర డీసీపీ–2 కె.ఆనందరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని అభినందించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం సహకారంతో స్టేషన్ ఆవరణ, చుట్టుపక్కల సుమారు 300 పండ్ల మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం జి.గాంధీ, టౌన్ అడ్మిన్ జీఎం వై.చంద్రశేఖర్, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, వెస్ట్ ఏసీపీ ఎ.నర్సింహమూర్తి, హార్బర్ ఏసీపీ మోజెస్ పాల్, ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జి.ఉమామహేశ్వరరావు పాల్గొని మొక్కలు నాటారు.

డూప్లికేట్ ఓట్ల తొలగింపులో అప్రమత్తంగా ఉండాలి



పాల్గొన్న ఎన్నికల సిబ్బంది



సమీక్ష నిర్వహిస్తున్న జేసీ విశ్వనాథన్

జేసీ విశ్వనాథన్

పెందుర్తి: ఓటరు జాబితాలో తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని ఎన్నికల సిబ్బందిని జాయింట్ కలెక్టర్ జె. విశ్వనాథన్ ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లు తొలగించే క్రమంలో జాగ్రత్త వహించడంతో పాటు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని సూచించారు. జీవీఎంసీ 97వవార్డు పరిధి సుజాతనగర్ కమ్యూనిటీ హాల్‌లో పెందుర్తి నియోజకర్గం పరిధిలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఎన్నికల సిబ్బందితో జేసీ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్లతో అధిక ఓట్లు ఉన్నా...ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. అన్ని వివరాలు సరిపోతేనే ఓట్లు తొలగించాలని సూచించారు. డూప్లికేటు ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా లేక వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకుని, తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్వోలు ఓటు సవరణలు ఈఆర్వో 2.0 ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఓటరు నమోదులో సవరణలు చేయడానికి తీసుకునే చర్యలను ఈ సందర్భంగా వివరించారు. పోలింగ్ స్టేషన్ ప్రకారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అందరూ తప్పకుండా పాటించాలన్నారు. జాబితా రూపకల్పనతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలియజేశారు. చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, మంచి ప్రగతి కనబర్చాలని హితవు పలికారు. సమావేశంలో డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పెందుర్తి తహసీల్దార్ శ్యామ్‌కుమార్,జీవీఎంసీ జోన్–8 కమిషనర్ మల్లయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడే సమస్యలకు కారణం

మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి

సబ్బవరం: మానసిక ఒత్తిడే మనం ఎదుర్కొనే సకల సమస్యలకు మూలకారణం అవుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'మేము ఉన్నాం–ఏ సమస్యకైనా పరిష్కారం ఉంది' అనే అంశంపై విద్యార్థులకు జిల్లా మెంటల్ హెల్త్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఎదుర్కొంటున్న సమస్యలకు గల కారణాలను, పరిష్కార మార్గాలను వివరించారు. 20 ఏళ్ల లోపు యువతీ యువకులు ఇటీవల కాలంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. సమస్యకు కారణం ఏంటో తెలుసుకుని కుటుంబ సభ్యులు,స్నేహితులు,బంధుమిత్రుల సహకారంతో సమస్యలను నుంచి బయట పడవచ్చన్నారు. మనుషుల మధ్య ఉండే సత్సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతాలక్ష్మి,మధులత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్,నివేదిత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

సీఐ అశోక్‌కుమార్



గురుకుల పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్ కుమార్

సింహాచలం/పెందుర్తి: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహనతో ఉండాలని ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ తెలిపారు. సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలతో పాటు పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ అశోక్ కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి తన వంతు బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను, నిబంధనలను వివరించాలని సూచించారు. ముఖ్యంగా వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. జంక్షన్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్ చూడకుండా వాహనాన్ని నడిపితే సంభవించే ప్రమాదాలను తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలపట్నం, పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐలు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్పెంటర్ దుర్మరణం



మృతుడు అప్పలాచారి(ఫైల్)



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, స్థానికులు

ఆరిలోవ: లారీ ఢీకొని ఓ కార్పెంటర్ మృతి చెందిన ఘటన ఓల్డ్ డెయిరీ ఫారం కూడలిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు, మృతుడు బంధువులు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం చేయాలంటూ బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి(36) కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పని చేసుకుని మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై విశాఖ బయలుదేరాడు. జాతీయ రహదారిపై ఓల్డ్ డెయిరీ ఫారం వద్ద ఆరిలోవ వైపు తిరిగే సమయంలో జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొంది. దీంతో అప్పలాచారి కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా లారీ యజమానిని పిలిపించి తమ కుటుంబానికి న్యాయం చేసేలా చూడాలని మృతుడు భార్య, పిల్లలు, బంధువులు, దుర్గానగర్ వాసులు బుధవారం ఆరిలోవ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఫిర్యాదు చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్టలేమని సీఐ సోమశేఖర్ వారికి నచ్చజెప్పారు. చివరకు సాయంత్రం ఈ ప్రమాదంపై మృతుడు భార్య జ్యోతి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో నలుగురు నిందితులు

గోపాలపట్నం: అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మర్రిపాలెం వద్ద పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. బుధవారం మర్రిపాలెం వద్ద గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆగంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తుల పట్టుకుని వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందుతులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించగా.. వారు దర్యాప్తు చేస్తున్నారు.